# కుల నిర్మూలన సంఘం



మారుతున్న నేటి పరిస్థితులలో, ఈ ఆధునిక ప్రపంచంలో కులమతాలకు తావులేదు. మనందరిదీ ఒకటే కులం. అందరి మనసులకు ఒకటే మతం. ఈ లక్ష్యం సిద్ధించాలంటే ముందు ఇపుడు ఉన్న కులాలన్నీ మాసి పోవాలి. అందుకే ఈ కులనిర్మూలన సంఘం స్థాపించాం. ఈ సంఘంలో సభ్యులు కాగోరువారు స్వయంగా మా ఆఫీసుకు వచ్చి కలుసుకోవచ్చు. లేదా పోస్టుద్వారా వివరాలు తెలుసుకోగలరు. అలాంటివారు ఒక రూపాయి కవరు పంపి వివరాలు తెప్పించుకోగలరు.

దిన పత్రికలలో ఈ ప్రకటన చూడగానే విశ్వనాథానికి ఎంతో ఆనందమయింది.

అతను వసుధైక కుంటుంబం, విశ్వమానవత్వం వంటి సిద్ధాంతాలలో విశ్వాసం, ఆసక్తి ఉన్నవాడు. తన ఆదర్శాలకు అనుగుణంగా ఏర్పడిన సంఘంలో సభ్యుడై ఆ లక్ష్యసిద్ధికి తన వంతు కృషి చేయాలనుకున్నాడు.

ఆరోజు విశ్వనాథం కుల నిర్మూలన సంఘం ఆఫీసుకు వెళ్లాడు.

అధ్యక్షుడు ప్రకాశరావుగారు అతన్ని సాదరంగా ఆహ్వానించి, తమ సంఘం ఆశయాలను వివరించి చెప్పారు. ఆ మాటలు వింటూ పరమానంద భరితుడయ్యాడు విశ్వనాథం.

ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ అధ్యక్షులవారు– "మీ కులం ఏమిటి?" అని అడిగాడు విశ్వనాథాన్ని. ఆ ప్రశ్న వినగానే కొయ్యబారిపోయాడు విశ్వనాథం.

ఆ షాకు నుంచి తేరుకుని, "సార్... మనది కుల నిర్మూలన సంఘం. అలాంటప్పుడు– నా కులంతో పనేమిటి?" అని అడిగాడు మొహమాటపడుతూ.

"అది నిజమేనండీ! కాకపోతే... మన సంఘంపట్ల ఏ కులంవారు అధికంగా ఆసక్తి చూపిస్తున్నారో తెలుసుకొని ఆసక్తి తక్కువగావున్న కులాలవారిలో ఉత్సాహం కల్పించడం కోసం అడిగాను... అంతే!" అన్నాడు ఆయన.

"కావచ్చుననుకోండి. అయినా... ఏ విధంగానూ కూడా కుల ప్రసక్తి ఉండడం నాకిష్టం లేదు" అన్నాడు విశ్వనాథం.

"సరే... మీ ఇష్టం!" అంటూ సభ్యత్వ పత్రం ఇచ్చాడు ఆయన విశ్వనాథానికి.

దరఖాస్తు ఫారం చూసి మళ్లీ గతుక్కుమన్నాడు విశ్వనాథం. పేరు క్రింద 'మీ కులం' అన్న అంశం ఉంది.

"కుల నిర్మూల సంఘం– అంటూ దరఖాస్తు ఫారాలలో కూడా మీరు కులాన్ని విస్మరించలేకపోతే కుల నిర్మూలన జరగడం అసంభవం! దేనిని అంతం చేయాలని అంటున్నారో దానినే పోషిస్తుంటే అది ఎలా అంతమవుతుంది? ఇటువంటి సంఘంలో సభ్యుడినై కులవ్యాప్తికి నేను దోహదం చేయలేను. మీ సంఘం నాకొద్దు" అంటూ సభ్యత్వం పత్రం అధ్యక్షులవారి బల్లమీద పడేసి విసురుగా బయటకు వచ్చాడు విశ్వనాథం.

*– జాగృతి వార పత్రిక... 24–30 డిసెంబర్ '90*